ఆగిన పనులు.. కారణం దేవుడెరుగు!

- అర్ధంతరంగా ఆగిపోయిన ఓయూ బైపాస్ రోడ్డు పనులు
- నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు
- ప్రారంభం అవుతాయే లేదో అని సందేహాలు


నిలిచిపోయిన బైపాస్ రోడ్డు పనులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. యూనివర్సిటీ క్యాంపస్ నుంచి బయటి వాహనాలు రాకుండా ఇంజినీరింగ్ కాలేజీ నుంచి జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ పక్క నుంచి ఫ్లై ఓవర్ కింది నుంచి లేడీస్ వెనుక వైపు బైపాస్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. బైపాస్ రోడ్డు నిర్మాణంతో యూనివర్సిటీ లోనికి వాహనాలు రాకుండా క్లోస్డ్ (మూసివేత) క్యాంపస్‌గా మార్చేందుకు ఓయూ వీసీ ప్రొ.రవీందర్, స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ నేతృత్వంలో గత అసెంబ్లీ ఎన్నికల కన్న ముందే పనులను ప్రారంభించారు. కానీ లేడీస్ హాస్టల్ వెనుక వైపు గల నాన్ టీచింగ్ హోం ఫంక్షన్ హాల్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్క నుంచి ప్రారంభమైన పనులు కొంత మేరకు కొనసాగించి నిలిపివేశారు. ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఇంకా పనులు ప్రారంభించలేదు.

రూ. కోట్లతో సగం పనులు..

జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ పక్కన గుడిసెలు వేసుకొని పది కుటుంబాలు నివసిస్తున్నారు. ఇంజినీరింగ్ కాలేజీ నుంచి బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించాలంటే గుడిసెలు తొలగించాలి. కానీ వేరే చోట స్థలం చూపించి గుడిసెవాసులను తొలగించాలని పట్టు పడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారడంతో నిధుల కొరత కూడా బైపాస్ రోడ్డు పనులు నిలిచిపోయినట్లు స్థానికులు తెలిపారు. కేటాయించిన రూ.16 కోట్లలో సుమారు రూ.2 కోట్ల పనులు మాత్రమే అయినట్లు సమాచారం. పనులు పూర్తిగా నిలిపి వేస్తే రూ.2 కోట్లు వృథా, పనులు ప్రారంభిస్తే రూ.14 కోట్లు అవసరం. కానీ రాష్ట్ర ఖజానా ఖాళీ అవడంతో ఓయూ క్యాంపస్‌లో నిర్మించనున్న బైపాస్ రోడ్డు పనుల ప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది.

జీహెచ్ఎంసీ అధికారులపై ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: సమాచార హక్కు చట్టం ద్వారా తాను అడిగిన సమాచారానికి సమాధానం ఇవ్వకుండా ఆ సమాచారాన్ని ఇతరులకు అందించి హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని జన తెలంగాణ రైట్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డెం శ్యాం రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించే జోనల్ సిటీ ప్లానర్ ప్రదీప్, సికింద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రజితలు ఇచ్చిన ఓ అనుమతులపై తమ సంస్థ సమాచార హక్కు చట్టం ద్వారా తాము వివరాలు కోరినట్లు ఆయన ఫిర్యాదులో తెలిపారు. కొంత మంది అవినీతి అధికారులు నిబంధనలు పూర్తిగా అతిక్రమించి ఇచ్చిన అనుమతులపై తాను ఆర్టీఐ చట్టం ద్వారా వివరాలు సేకరించేందుకు యత్నిస్తే అదే ఫైల్‌కు సంబంధించిన వ్యక్తులకు దరఖాస్తు చేసిన తమ వివరాలు, ఫోన్ నంబర్లు అందించారని తెలిపారు. ఇలా చేయడంతో దరఖాస్తుదారుల ప్రాణాలకు రక్షణ ఉండదని, సమాచార హక్కు చట్టంలో ఇదే నిబంధన ఉందని అధికారుల నిర్వాహకంతో తమ సంస్థకు చెందిన వ్యక్తుల ప్రాణాలకు అపాయం పొంచి ఉందని అందులో తెలిపారు. ఇలా గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని ఇతరులకు అందించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ యోచనను స్వాగతిస్తున్నాం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనను స్వాగతిస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ విద్యార్థి నేత చనగాని దయాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసినా ఉద్యోగ, ఉపాధి లభించక నిరుద్యోగులుగా మారుతున్నారని తెలిపారు. డిగ్రీ స్థాయి నుంచే కొలువుల దిశగా సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ వర్సిటీ ఏర్పాటు ఆలోచనతో నిరుద్యోగ సమస్యకు కొంత మేర పరిష్కారం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో విద్యకు ప్రాధాన్యమివ్వగా ప్రత్యేక రాష్ట్రం అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ బార్లు, వైన్స్ షాపులకు ప్రాధాన్యతనిచ్చి యువతను మత్తులో తాగుబోతులుగా మార్చారని ఆరోపించారు. కరెంట్ బిల్లులు చెల్లించలేని ఆర్థిక దుస్థితిలో ప్రభుత్వ వర్సిటీలు ఉండగా విద్యార్థుల నుంచి రూ. లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్న ప్రవేటు వర్సిటీలు కళకళలాడుతున్నాయన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు


ఆరాధనోత్సవంలో చిన్నారులు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాజ 176వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ ఉత్సవాల్లో భాగంగా నర్తనశాల డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా త్యాగరాజస్వామిని స్తుతిస్తూ సాగిన గీతాలు శ్రావ్యానందాన్ని అందించాయి. అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ఏర్పాట్లు చేశారు.

విజయ్ స్తంభ్ సందర్శన


విజయ్ స్తంభ్ వద్ద స్వేరో ప్రతినిధులు

లాలాపేట: పుణెలోని భీమా కోరేగావ్ విజయ స్తంభ్‌ను హైదరాబాద్‌కు చెందిన స్వేరోస్ నేతలు సోమవారం సందర్శించారు. 1818 జనవరి 1న 500 మంది మహార్ సైనికులు, పేష్వా సైనికులపై యుద్ధం చేసి విజయ సాధించారు. దానికి చిహ్నంగా బ్రిటీష్ ప్రభుత్వం నాడు విజయ స్తంభాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి సంవత్సరం ఈ విజయ స్తంభ్‌ను లక్షలాదిమంది దర్శించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్ షాను, విఠల్‌రావు, యాదగిరి, లక్ష్మణ్, సంజయ్, అమూల్ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించండి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రవేటు యూనివర్సిటీలలో జరిగే అవకతవకలపై విచారణ జరిపించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి గ్రీటింగ్ కార్డును అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూజీసీ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా కొనసాగుతున్న ప్రవేటు వర్సిటీలపై విచారణ జరిపి రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వం అనుమతించిన ప్రవేటు వర్సిటీలలో ఉద్దేశపూర్వకంగానే రిజర్వేషన్లను పాటించలేదని ఈ విద్య సంవత్సరం నుంచి రిజర్వేషన్లు అమలు చేయాలని గవర్నర్‌ను కోరానన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

లాలాపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన రౌతు సతీష్ (45) అప్పుల బాధతో గతేడాది నగరానికి వచ్చి తార్నాకలో శ్రీవారి నిలయం అపార్టుమెంట్‌లో స్నేహితుడి వద్ద ఉంటూ రాణిగంజ్‌లో ఓ మొబైల్ దుకాణంలో పని చేస్తున్నాడు. అప్పులు చెల్లించలేని స్థితిలో తీవ్ర మనస్తాపంతో గత రాత్రి తన స్నేహితుడు నిద్రిస్తున్న వేళ బాల్కనీలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం లేచిన స్నేహితుడు చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి పునఃప్రారంభం

సనత్‌నగర్: రెండ్రోజుల సెలవు తర్వాత నేడు (మంగళవారం) ప్రజాపాలన పునఃప్రారంభం కానుంది. బేగంపేట సర్కిల్‌లో మొత్తం నాలుగు డివిజన్లకు గాను ఒక్కో డివిజన్‌లో నాలుగు సెంటర్లను ఏర్పాటు చేశారు. అలా ఏర్పాటైన ఒక్కో సెంటర్‌లో నాలుగు స్వీకరణ కౌంటర్లను ఏర్పాటుచేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

నేడు దరఖాస్తు స్వీకరణ ప్రాంతాలివే..

బన్సీలాల్‌పేట డివిజన్

- ▲ కీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్‌సొసైటీ కమ్యూనిటీహాల్‌లోని ప్రజాపాలన కేంద్రంలో జయనగర్ వాసుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు.
- ▲ పద్మారావునగర్ వెంకటాపురం తుంగభద్ర కమ్యూనిటీహాల్‌లో చిదంబరంకాలనీ వాసులు.
- ▲ సీసీనగర్ కమ్యూనిటీహాల్ సెంటర్‌లో పొట్టిశ్రీరాములునగర్ వాసులు.
- ▲ భోలక్‌పూర్ కృష్ణానగర్ కాలనీ ఎవర్ గ్రీన్ కమ్యూనిటీహాల్‌లో మేకలమండి ప్రాంతవాసులు.

రాంగోపాల్‌పేట డివిజన్

- ▲ ఎంజీరోడ్డులోని గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్‌లో రంగ్రేజీబజార్ వాసులు.
- ▲ చుట్టలబస్తీ కమ్యూనిటీ హాల్‌లో కండోజీబజార్ నివాసితులు.
- ▲ మేకలమండి కమ్యూనిటీహాల్‌లో ఓల్డ్ బోయిగూడ నివాసితులు.
- ▲ రాజీవ్‌గాంధీ కమ్యూనిటీ హాల్‌లో కృష్ణానగర్ నివాసితులు.

బేగంపేట డివిజన్.

- ▲ బేగంపేట పాటిగడ్డ మోడల్‌మార్కెట్ వద్ద సెంటర్‌లో ఓల్డ్‌పాటిగడ్డ నివాసితులు.
- ▲ మయూరిమార్గ్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో వెల్కిన్‌పార్క్ ప్రాంత నివాసితులు.
- ▲ మాతాజీనగర్ కమ్యూనిటీ హాల్ సెంటర్‌లో చీకోటిగార్డెన్ నివాసితులు.
- ▲ శ్యాంలాల్‌బిల్డింగ్స్ తాతాచారి కాలనీ కమ్యూనిటీ హాల్ సెంటర్‌లో భగత్ సింగ్‌నగర్ నివాసితులు.

మోండా డివిజన్..

- ▲ పెర్కిబస్తీ కమ్యూనిటీ హాల్ సెంటర్‌లో రెజిమెంటల్‌బజార్ సౌత్ వాసులు.
- ▲ ఆదయ్యనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెంటర్‌లో టకారాబస్తీ ప్రాంతవాసులు.
- ▲ చాపలబౌలి కమ్యూనిటీహాల్ సెంటర్‌లో జేకుమ్మరిగూడ ప్రాంతవాసులు.
- ▲ వెస్ట్‌మారేడ్‌పల్లి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ కేంద్రంలో లొయ్యనగర్ బస్తీవాసులు.

ఖైరతాబాద్ సర్కిల్

అమీర్‌పేట డివిజన్..

- ▲ బీకేగూడ వార్డు కార్యాలయం ప్రజాపాలన కేంద్రంలో ప్రశాంత్‌కాలనీ నివాసితులు.
- ▲ ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీహాల్ సెంటర్‌లో ఈస్ట్‌శ్రీనివాస్‌నగర్ నివాసితులు.
- ▲ లీలానగర్ కమ్యూనిటీ హాల్ కేంద్రంలో బీజేఆర్‌నగర్ నివాసితులు.
- ▲ శ్రీవివేకానంద కమ్యూనిటీహాల్ కేంద్రంలో గురుమూర్తికాలనీ వాసులు.

సనత్‌నగర్ డివిజన్..

- ▲ నెహ్రూపార్కు వార్డు కార్యాలయ సెంటర్‌లో సౌభాగ్యనగర్ నివాసితులు.
- ▲ దాసారం బస్తీ కమ్యూనిటీహాల్ కేంద్రంలో సీ-టైపు క్వార్టర్స్ నివాసితులు.
- ▲ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కేంద్రంలో ఉదయ్‌నగర్ నివాసితులు.
- ▲ అల్లావుద్దీన్‌కోఠి కమ్యూనిటీ హాల్‌లో జెక్‌కాలనీ నివాసితుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు.

నూతనోత్సాహం

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి 12 దాటిన తర్వాత డీజేల హోరు, నృత్యాల జోరుతో ఉర్రూతలూగించారు. వయసు భేదం లేకుండా నూతన వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. సోమవారం ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు కుటుంబ సమేతంగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


సికింద్రాబాద్ షటిల్ రైడర్స్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేస్తున్న క్రీడాకారులు, వాకర్లు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


షిరిడీ సాయిబాబాను దర్శించుకున్న మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి


కేలండర్ ఆవిష్కరిస్తున్న ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా


కేక్ కట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


కేక్ కట్ చేస్తున్న సదా కేశవరెడ్డి


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


సర్వేకు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రీన్‌సిటీ అధినేత సుబ్బరాజు


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తలసాని సాయికిరణ్‌యాదవ్


పుష్పాలంకరణలో వెంకన్నస్వామి


అక్బరుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అశోక్


న్యూ ఇయర్ గ్రీటింగ్స్‌ను ప్రకటిస్తున్న రెవరెండ్ ఆర్. విలియం కేరి


బీఆర్ఎస్ కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు, చంద్రశేఖర్


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వంజరి సంఘం నాయకులు


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్


న్యూఇయర్ వేడుకల సందర్భంగా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్